

ఆటకు చోటేదీ..?

క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం.. శారీరక ధృఢత్వం.. మానసికోల్లాసం.. వేదికలెక్కిన ప్రతి ఒక్కరూ చెప్పే మాటలివే.. అయితే.. 8లో▸



ఆధ్యాత్మిక చింతనతో..

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. 8లో▸



రైతులకు రుణ 'సహకారం'

వానాకాలం సీజన్‌లో రైతులకు రుణాలు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. 9లో▸

న్యూస్‌రీల్

స్టోన్ మర్చంట్ల సమస్యలు పరిష్కరిస్తాం

గనుల శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి



మంత్రి పట్నం, ఎంపీ రంజిత్‌రెడ్డిని సన్మానిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

తాండూరు: స్టోన్ మర్చంట్లు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని గనుల శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి హామీ ఇచ్చారు. గురువారం తాండూరు స్టోన్ మర్చంట్, క్వారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు హైదరాబాద్‌లో మంత్రిని, ఎంపీ రంజిత్‌రెడ్డిని కలసి సన్మానించారు.. ఈ సందర్భంగా తాండూరు ప్రాంతంలో నాపరాతి రవాణాలో ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన నాపరాతి వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యలు తనకు తెలుసన్నారు. త్వరలో ఎంపీ రంజిత్‌రెడ్డితో కలిసి తాండూరుకు వచ్చి సమస్యలకు పరిష్కారం చూపుతామని పేర్కొన్నారు. మంత్రిని కలసిన వారిలో క్వారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అబ్దుల్ రవూఫ్, అసోసియేషన్ ప్రతినిధులు ఓం ప్రకాష్ సోమాని, జుబేర్‌లాల, బీఆర్‌ఎస్ తాండూరు పట్టణ అధ్యక్షుడు నయీం తదితరులు పాల్గొన్నారు.

పంటల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి



కొడంగల్: రైతులు వారివారి పొలాల్లో సాగు చేస్తున్న పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి గోపాల్ సూచించారు. శుక్రవారం ఆయన మండలంలోని కస్తూరుపల్లి పొలాల్లో పర్యటించి ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ఏయే పంటలు సాగు చేశారు అనే సమాచారం ప్రభుత్వం వద్ద ఉంటే పంట కొనుగోలు, పరిహారం చెల్లింపు సమయాల్లో ఇబ్బందులు ఉండవన్నారు. కార్యక్రమంలో ఏఈఓ సుమ తదితరులు పాల్గొన్నారు.

'టెట్'ను పకడ్బందీగా నిర్వహించాలి

అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ



సమీక్షలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ

వికారాబాద్ అర్బన్: ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)ను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ నెల 15న టెట్ పరీక్ష నిర్వహించనున్న నేపథ్యంలో ఏర్పాట్లపై శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయ అర్హత పరీక్ష సజావుగా జరిగే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జిల్లాలో 25 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం నిర్వహించే పేపర్ -1 పరీక్షకు 5,765 మంది, మధ్యాహ్నం నిర్వహించే పేపర్ -2 పరీక్షకు 3,846 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. పరీక్షలు కేంద్రాల్లో వసతులు కల్పించాలని ఆదేశించారు. సమావేశంలో డీఈఓ రేణుకాదేవి, డీటీఓ దశరథ్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ జీవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

తాండూరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టు భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ రవీందర్ శుక్రవారం తెలిపారు. కామర్స్ సబ్జెక్ట్ బోధించేందుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తు కోరుతున్నట్లు తెలిపారు. ఈ సబ్జెక్ట్‌లో 55శాతం మార్కులు పొందిన వారు అర్హులన్నారు. అంతేకాకుండా ఎతటీ/ఎస్‌ఈటీ లేదా పీహెచ్‌డీ ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 4వ తేదీ సాయంత్రం లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఏకగ్రీవం.. ఏదీ సాయం!

ఏకగ్రీవ పంచాయతీలకు రూ.15లక్షల నిధులు ప్రోత్సాహకంగా అందజేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. గ్రామ సమస్యల పరిష్కారం, అభివృద్ధి కోసం ప్రజలు, ప్రజాప్రతినిధులు ఏకతాటిపైకి వచ్చి గ్రామాలను యునానిమస్ చేసుకున్నారు. కానీ ఏళ్లు గడుస్తున్నా నేటికీ నిధులు రాకపోవడంతో నిరాశ చెందుతున్నారు.

- ఉమ్మడి జిల్లాలో 135 పంచాయతీలకు అందని ప్రోత్సాహకం
- అప్పుల్లో సర్పంచులు.. ఆందోళనలో కుటుంబ సభ్యులు
- పట్టించుకోని ప్రభుత్వం



ఏకగ్రీవంగా ఎన్నికైన కడ్తాల్ మండలం పెద్దవేములోని బావితండా పంచాయతీ

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఏకగ్రీవంగా ఎన్నికైన గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం మొండి చేయి చూపింది. ఎన్నికల ముందు నగదు ప్రోత్సాహకం అందజేయనున్నట్లు ప్రకటించి.. ఆ తర్వాత ఇచ్చిన హామీలను విస్మరించింది. ఫలితంగా అప్పులు చేసి సర్పంచ్‌గా ఎన్నికైన అభ్యర్థులకు ఆ తర్వాత ఇబ్బందులు తప్పడం లేదు. పాలకమండళ్లు ఏర్పడి నాలుగేళ్లు కావొస్తున్నా.. ఇప్పటికీ నగదు ప్రోత్సాహకం అందకపోవడం, ఎన్నికల కోసం చేసిన అప్పులు ఇప్పటికీ తీరక పోవడంతో ఆయా గ్రామాల సర్పంచుల కుటుంబాలు ఆర్థికంగా చితికిపోయే పరిస్థితి తలెత్తింది.

ఆశించిన స్థాయిలో నిధులు కేటాయించక

ప్రభుత్వం జిల్లాలోని గ్రామ పంచాయతీలకు 2019 జనవరిలో సర్పంచ్ ఎన్నికలు నిర్వహించింది. ఫిబ్రవరి 2న పాలకవర్గం ఏర్పాటు చేసింది. ఏకగ్రీవంగా ఎన్నికైన చిన్న పంచాయతీలకు రూ.10 లక్షలు.. పెద్ద పంచాయతీలకు రూ.15 లక్షల చొప్పున ప్రోత్సాహక బహుమతిగా అందజేయనున్నట్లు ప్రకటించింది. ఈ నిధులతో గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని భావించిన సర్పంచ్‌లకు నిరాశే మిగిలింది. కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న 15వ ఆర్థిక సంఘం నిధులతో జీపీల్లో పారిశుద్ధ్యం, వీధి దీపాల నిర్వహణ, మురుగు కాల్వల పూడిక తీత, తాగునీటి సరఫరా, ట్రాక్టర్లకు వాయిదాలు, డీజిల్ కొనుగోలు, విద్యుత్ బిల్లుల చెల్లింపు, ఇతర అభివృద్ధి పనులు చేసుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలో 1,187 పంచాయతీలు ఉండగా, వీటిలో 135 పంచాయతీలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి. వీటికి ఇప్పటి వరకు ముందస్తు ప్రకటించిన ప్రోత్సాహకంతో పాటు ఆశించిన స్థాయిలో నిధులు కేటాయించకపోవడంతో కనీస మౌలిక సదుపాయాలకు నోచుకోలేక పోతున్నాయి. ఎన్నికల కోసం ఇప్పటికే భారీగా అప్పులు చేసిన సర్పంచ్‌లు.. అభివృద్ధి పనులకు కూడా యాచించాల్సిన పరిస్థితి తలెత్తింది.

- చేవెళ్ల నియోజకవర్గంలోని షాబాద్ మండలం తిర్మలాపూర్, లక్ష్మారావుగూడ, పోలారం, బొబ్బిలిగామ, గొల్లూరుగూడ గ్రామ పంచాయతీలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి. ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి పైసా ప్రోత్సాహకం అందలేదు.
- ఆమనగల్లు నియోజకవర్గంలోని కొత్తకుంటతండా, మాడ్గుల మండలం పలుకుతండా, కాశగూడెం, గుడితండా, తలకొండపల్లి మండలం పడమటి తండా, బలుసులపల్లి తండా, కోరింతకుంట తండా, హర్యానాయక్ తండా, వెల్జాల్ పంచాయతీలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి. కడ్తాల్ మండల పరిధిలో పల్లెచెలక, గానుగమార్ల తండా, బాలాజీ నగర్, పెద్ద వేములబావి తండా, నార్లకుంట తండాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.
- ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పరిధిలోని మంచాల మండలం సత్తితండా, యాచారం మండలం నందివనపర్తి, కేశితండా గ్రామాలు ఏకగ్రీవమయ్యాయి.
- షాద్‌నగర్ నియోజకవర్గం కన్హశాంతివనం, బండోనిగూడ గ్రామ పంచాయతీలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి. వీటిలో ఏ ఒక్క గ్రామ పంచాయతీకి ఇప్పటి వరకు నయా పైసా అందలేదు.

జిల్లా	మొత్తం జీపీలు	ఏకగ్రీవం
రంగారెడ్డి	560	53
వికారాబాద్	566	75
మేడ్చల్	61	07

ఇప్పటికీ పైసా రాలేదు



ఏకగ్రీవ గ్రామ పంచాయతీలకు రూ.10 లక్షలు ఇస్తామన్నారు.ఇప్పటికీ పైసా ఇవ్వలేదు. అప్పులు చేసి అభివృద్ధి చేస్తున్నాం.ఆయా పనులకు సంబంధించిన బిల్లులు సైతం రాలేదు. ప్రభుత్వానికి అనేక మార్లు విజ్ఞప్తి చేశాం. కానీ కనీస స్పందన కూడా లేదు.

– శ్రీధర్‌రెడ్డి, సర్పంచ్, తిర్మలాపూర్

అడిగినా ఇవ్వలేదు



నందివనపర్తి గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యాను. ఎన్నికల ముందు నగదు ప్రోత్సాహకం ఇస్తామని చెప్పారు. ఇప్పటికీ ఇవ్వలేదు. పలు మార్లు జిల్లా పంచాయతీ అధికారిని అడిగాం. అయినా ఫలితం లేదు.

– కంబాలపల్లి ఉదయశ్రీ, సర్పంచ్, నందివనపర్తి



పరిగి తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న బాధితులు

తెరవెనక ఉన్నదెవరు?

- రూ.30 కోట్ల భూమిపై కన్నేసిన పెద్దలు
- ఒకరితో అగ్రిమెంట్ చేసుకుని మరొకరికి రిజిస్ట్రేషన్ చేసిన యజమాని
- బాధిత గిరిజనులపై పరిగి, వికారాబాద్ పోలీస్ స్టేషన్లలో కేసులు

వికారాబాద్: రూ.30 కోట్ల విలువైన 22 ఎకరాల భూమి రిజిస్ట్రేషన్ వ్యవహారం జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది. ముందుగా ఒకరికి అగ్రిమెంట్ చేసిన భూమిని.. సదరు యజమాని మరొకరికి రిజిస్ట్రేషన్ చేయడం వెనక అధికార పార్టీకి చెందిన ఓ నేత హస్తం ఉందని బాధితులు ఆరోపిస్తున్నారు. ఆయన అండదండలతోనే రెవెన్యూ, పోలీసు అధికారులు తమకు అన్యాయం చేస్తున్నారని వాపోతున్నారు. అండగా నిలవాల్సిన పోలీసులు తమపైనే తప్పుడు కేసులు బనాయించారని, తాము రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన భూమిని రెవెన్యూ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా మరొకరికి రిజిస్ట్రేషన్ చేశారని రోదిస్తున్నారు.

ఏం జరిగిందంటే..

రంగాపూర్ శివారులో జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న సర్వే నంబర్ 94, 95, 96లో గల 22 ఎకరాల భూమిని నిజామాబాద్‌కు చెందిన ఓ రియల్టర్ నుంచి.. నజీరాబాద్ తండాకు చెందిన యువకులు ఏడాది క్రితం అగ్రిమెంట్ చేసుకున్నారు. ఈ భూమి నిషేధిత జాబితాలో ఉండటంతో సమస్యను తామే పరిష్కరించుకుంటామని.. ఇందుకు అయ్యే ఖర్చును సైతం భరిస్తామని ఓనర్‌తో అగ్రిమెంట్ రాసుకున్నారు. ఈక్రమంలో ఏడాది పాటు ఆఫీసుల చుట్టూ తిరగడంతో పాటు కలెక్టరేట్, సీసీఎల్‌ఏలో.. అడిగిన వారికల్లా ఇస్తూ సుమారు రూ.2 కోట్లు ఖర్చు చేశారు. దీంతో సదరు భూమి ప్రొహిబిటెడ్ జాబితా నుంచి బయటకు వచ్చింది. ఒప్పందం ప్రకారం భూ యజమానికి ఫోన్ చేసిన బాధితులు మిగిలిన డబ్బులు తీసుకుని రిజిస్ట్రేషన్ చేయాలని కోరారు. కానీ సదరు వ్యాపారి మాత్రం ఫోన్ స్విచాఫ్ చేసుకుని, మరో వ్యక్తి పేరున రిజిస్ట్రేషన్ చేయించాడు. విషయం తెలుసుకున్న బాధితులు.. భూమి కోసం తాము ఏడాదిగా తిరుగుతున్నామని, రూ.2 కోట్లు ఖర్చుచేశామని.. ఇక ఆత్మహత్యే శరణ్యమని రోదిస్తూ.. గురువారం తహసీల్దార్ ఎదుట ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించారు. ఇదిలా ఉండగా తహసీల్దార్ కార్యాలయంలోని ఉద్యోగులు శుక్రవారం మూకుమ్మడిగా విధులకు గైర్హాజరు కావడం సైతం అనుమానాలను బలపరుస్తోంది.

బాధితులపైనే కేసులు

తమను మోసం చేసిన వ్యక్తి వికారాబాద్‌లోని ఓ హోటల్ ఉన్నాడని తెలుసుకున్న బాధితులు అతన్ని కలిసి అడిగేందుకు వెళ్లగా.. వికారాబాద్ పోలీసులు గిరిజన యువకులపై కిడ్నాప్ కేసు పెట్టారు. సదరు భూమిని తాము అగ్రిమెంట్ చేసుకున్నామని మరొకరికి రిజిస్ట్రేషన్ చేయొద్దని కోరుతూ బాధితులు న్యాయవాది ద్వారా నోటీసులు పంపించినప్పటికీ.. అధికారులు మాత్రం గుట్టుగా రిజిస్ట్రేషన్ చేయాల్సిన అవసరం ఏమొచ్చిందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పరిగి తహసీల్ కార్యాలయంలోనే రిజిస్ట్రేషన్ జరిగిందని అధికారులు చెబుతుండగా.. ఉదయం నుంచి సాయంత్రం వరకు భూయజమాని కార్యాలయానికే రాలేదని బాధితులు చెబుతున్నారు. తహసీల్దార్ తన డిజిటల్ కీ, ల్యాప్‌టాప్ తీసుకువెళ్లి బయట ఎక్కడో కూర్చుని రిజిస్ట్రేషన్ చేశాడని బాధితులు ఆరోపిస్తున్నారు. వీవీఐపీలు, సెలబ్రిటీలు సైతం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి రిజిస్ట్రేషన్లు చేయించుకుంటుండగా.. ఈ రిజిస్ట్రేషన్ మాత్రం కార్యాలయం వెలుపలే జరిగిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయంలో ఉన్నతాధికారులు స్పందించి అక్కడున్న సీసీ కెమెరాల సాయంతో విచారణ జరిపి నిజాలు నిగ్గుతేల్చాలనే డిమాండ్ వ్యక్తమవుతుంది. ఈ వ్యవహారంలో ఆయా శాఖల ఉన్నతాధికారులకు కోట్ల రూపాయలు ముట్టాయనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ విషయంపై గిరిజన సంఘాలు రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు సిద్ధమవుతున్నాయి. అవసరమైతే సదరు నేత ఇంటి ఎదుట ఆందోళనకు దిగుతామని హెచ్చరిస్తున్నాయి.

మరోసారి ఆశీర్వదించండి



కోట్‌మర్పల్లి - చిట్టంపల్లి మార్గంలో కల్వర్టు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆనంద్

- తనను గెలిపిస్తే వికారాబాద్ రూపురేఖలు మారుస్తా
- ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్

మర్పల్లి: మరోసారి నన్ను ప్రజలు ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గెలిపిస్తే వికారాబాద్ నియోజకవర్గ రూపురేఖలు మారుస్తానని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. శుక్రవారం మండలంలోని కోట్‌మర్పల్లిలో జెడ్పీటీసీ మధుకర్, సర్పంచ్ విజయలక్ష్మితో కలిసి వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించారు. కోట్‌మర్పల్లి – మోమిన్‌పేట్ మండలం చిట్టంపల్లి తండా మార్గంలో రూ. 73లక్షలతో నిర్మించనున్న కల్వర్టు పనులను ప్రారంభించారు. అనంతరం రూ. 20లక్షలతో నిర్మించనున్న జీపీ భవన పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే రూ. 20లక్షల చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు శిలాఫలకం వేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చిన తరువాతే పల్లెలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాయన్నారు. తండాలను గ్రామ పంచాయతీలుగా చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఒక వైపు సంక్షేమ పథకాలు, మరోవైపు దళిత, బీసీ, మైనార్టీలకు ఆర్థిక సహాయం అందిస్తూ ప్రగతికి బాటలు వేస్తున్నట్లు తెలిపారు. స్థలం ఉండి ఇల్లు కట్టుకోలేని వారికి గృహలక్ష్మి పథకం కింద రూ. 3లక్షలు ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఆర్‌ఓ గణేష్, ఎంపీడీఓ రాజ్‌మలయ్య, ఏఈ శ్రావణ్‌కుమార్, డీసీసీబీ మాజీ డైరెక్టర్ ఎస్ ప్రభాకర్ గుప్తా, వైస్ ఎంపీపీ మోహన్‌రెడ్డి, రైతు బంధు మండల అధ్యక్షుడు నాయబ్‌గౌడ్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు శ్రీనివాస్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, ఉపాధ్యక్షులు అశోక్, రమేష్ మిత్ర, ప్రధాన కార్యదర్శి రాచన్న, యూత్ ప్రసిడెంట్ మధుకర్, వైస్ ప్రసిడెంట్ జైహింద్‌రెడ్డి, సహకార సంఘం మాజీ చైర్మన్ రఘుపతిరెడ్డి పాల్గొన్నారు.

ఆనంద్‌ను ఓడించి తీరుతాం

- సర్వేలన్నీ ఆయనకు వ్యతిరేకంగానే వచ్చాయి
- అధిష్టానం పునరాలోచించాలి
- వికారాబాద్‌లో బీఆర్‌ఎస్ అసమ్మతి గళం
- ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నేతల సమావేశం

వికారాబాద్: 'ఎమ్మెల్యే ఆనంద్ అవినీతిలో కూరుకుపోయారు.. గడిచిన ఐదేళ్లలో వందల కోట్లు పోగేసుకున్నారు.. పార్టీ ఇచ్చే నామినేటెడ్ పదవులు సైతం అమ్ముకున్నారు..సర్వేలన్నీ ఆయన ఓడిపోతాడనే చెబుతున్నాయి..అలాంటి వ్యక్తికి టికెట్ ఇవ్వడం సరికాదు.. వెంటనే అభ్యర్థిని మార్చాలి.. లేదంటే ఓడించి తీరుతాం'..అని బీఆర్‌ఎస్ అసమ్మతి నేతలు స్పష్టం చేశారు.శుక్రవారం పట్టణంలోని బసంతి ఫంక్షన్ హాల్‌లో సుమారు 2వేల మంది ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా సమావేశమయ్యారు. బీఆర్‌ఎస్ అధిష్టానం ఆనంద్ టికెట్ విషయంలో పునరాలోచించాలని, అభ్యర్థిని మారిస్తే సహకరిస్తామని, లేదంటే ఆనంద్‌ను ఓడించి తీరుతామని పేర్కొన్నారు.



వికారాబాద్‌లో సమావేశమైనఎమ్మెల్యే అసమ్మతి నేతలు

హాజరైన ముఖ్య నేతలు..

నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన పలువురు బీఆర్‌ఎస్ నేతలు ఎమ్మెల్యే ఆనంద్‌కు వ్యతిరేకంగా గళం విప్పారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కొండల్‌రెడ్డి, ధారూరు ఎంపీపీ విజయలక్ష్మి భర్త హన్మంతురెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ రాంచంద్రారెడ్డి, సీనియర్ నాయకులు కృష్ణ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా సమావేశమయ్యారు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీ రంజిత్‌రెడ్డి వారికి ఫోన్ చేసి సముదాయించే ప్రయత్నం చేసినట్టు తెలుస్తోంది.

కాంగ్రెస్ వైపు అసమ్మతి నేతలు

జెడ్పీ వైస్ చైర్మన్ బైండ్ల విజయ్‌కుమార్, బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్‌పటేల్, సీనియర్ నాయకుడు వడ్ల నందు మరి కొందరు ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా జట్టు కట్టారు. అయితే వీరు శుక్రవారం నిర్వహించిన సమావేశానికి హాజరు కాలేదు. అసమ్మతి నేతలు కృష్ణ, మరో ఒకరిద్దరు మినహా మిగతా వారంతా కాంగ్రెస్ వైపు చూస్తున్నట్లు సమాచారం. కాంగ్రెస్ నేతలు సైతం వీరితో సంప్రదింపులు జరిపినట్టు ప్రచారం సాగుతోంది.

చిన్నారిని చిదిమేసిన లారీ



కొడుకు మృతదేహాన్ని ఒడిలో పెట్టుకొని రోదిస్తున్న తల్లి

- తల్లితో రోడ్డు దాటుతున్న బాలుడిని ఢీ కొట్టిన లారీ
- కళ్లముందే కొడుకు మృతి చెందడంతో మిన్నంటిన రోదనలు

పరిగి: రాఖీ పండుగ జరుపుకున్న ఆనందం గంటల్లో ఆవిరైపోయింది. అన్నకు రాఖీ కట్టేందుకు ఓ మహిళ కొడుకులతో కలసి సొంతూరికి వెళ్లింది. తిరిగి వస్తున్న క్రమంలో ఆమె కుమారుడిని లారీ రూపంలో మృత్యువు వెంటాడింది. అప్పటి దాకా సరదాగా నవ్వుతూ మాట్లాడిన చిన్నారి ఒక్కసారిగా విగతజీవిగా మారడంతో ఆ తల్లి, సోదరుడు గుండె పగిలేలా రోదించారు. ఈ ఘటన పరిగి పట్టణంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని రంగంపల్లికి చెందిన మహేశ్వరికి ఇద్దరు పిల్లలు. గొడవల కారణంగా ఆమె భర్త రవికుమార్‌కు దూరంగా ఉంటోంది. కూలి పనులు చేసుకుంటూ పిల్లలను చదివిస్తోంది. రాఖీ పండుగ సందర్భంగా మహేశ్వరి తన తల్లి గ్రామమైన దోమ మండలం బ్రాహ్మణపల్లి వెళ్లి అన్నకు రాఖీ కట్టి తిరిగి పరిగికి వచ్చింది. బస్ డిపో ఎదురుగా రోడ్డు దాటుతుండగా లారీ వేగంగా వచ్చి మహేశ్వరి చిన్న కుమారుడు శివ(6) ఢీకొట్టింది. దీంతో శివ అక్కడికక్కడే మృతి చెందాడు. కళ్ల ముందే కన్న కొడుకు మృతి చెందడంతో ఆ తల్లి రోదనలు మిన్నంటాయి. కొద్ది సేపటి క్రితం వరకు నవ్వుతూ అన్నా అని పలకరించిన తమ్ముడు మృతి చెందడంతో ఆ చిన్నారి రోదనలు అందరినీ కంటతడి పెట్టించాయి. మృతుడి తల్లి మహేశ్వరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడలకు ప్రభుత్వ ప్రోత్సాహం

- ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి
- పరిగిలో అండర్ -14 క్రికెట్ పోటీలు ప్రారంభం



బ్యాటింగ్ చేసి క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి: క్రీడలు, క్రీడాకారులను బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పరిగి పట్టణంలో అండర్ -14 క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్, నాయకులు ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌వి మాయ మాటలు

- ఆ పార్టీకి ఓటు అడిగే హక్కు లేదు
- మాజీ మంత్రి ప్రసాద్ కుమార్
- జంబాపూర్, కొట్టంగుట్ట తండాల్లో హాత్ సే హాత్ జోడో కార్యక్రమం

అనంతగిరి: హామీలను విస్మరించిన బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో ఓట్లు అడిగే హక్కు లేదని మాజీ మంత్రి ప్రసాద్ కుమార్ అన్నారు. శుక్రవారం వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని జంబాపూర్, కొట్టంగుట్ట తండాల్లో పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డితో కలసి హాత్ సే హాత్ జోడో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ జిమ్మిక్కులతో ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో పేదలకు ఇందిరమ్మ ఇళ్లు కట్టి ఇచ్చామని గుర్తు చేశారు. కేసీఆర్ తొమ్మిదేళ్ల పాలనలో ఎంత మంది పేదలకు ఇళ్లు ఇచ్చారో చెప్పాలని కోరారు. వికారాబాద్‌లో ఒక్కరికి కూడా డబుల్ ఇళ్లు రాలేదన్నారు. ఈ ప్రభుత్వానికి పేదలపై ప్రేమ లేదన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడేది కాంగ్రెస్ పార్టీ మాత్రమే అని అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం మరోసారి మాయమాటలతో ప్రజలను మభ్య పెట్టే ప్రయత్నం చేస్తోందని, ఆ పార్టీ నాయకుల మాటలు ఎవరూ నమ్మరాదని సూచించారు. కాంగ్రెస్ హయాంలోనే ఈ ప్రాంతం అభివృద్ధి చెందిందన్నారు. ప్రజలంతా కాంగ్రెస్‌కు పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ సందర్భంగా పలు పార్టీల నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ కిషన్ నాయక్, మాజీ ఎంపీపీ నర్సింలు, కౌన్సిలర్లు మురళి, వేణుగోపాల్ రెడ్డి, రెడ్యా నాయక్, నర్సింలు, రఘుపతిరెడ్డి, గజేందర్, శ్రీనివాస్ ముదిరాజ్, ఆనంద్, హాజీ, ప్రమోద్, మల్లుగౌడ్, రంగరాజు, హనుమంతు, జంగయ్య, బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ప్రసాద్ కుమార్

క్లుప్తంగా

నేడు సమగ్ర శిక్షలో ఖాళీ పోస్టులకు కౌన్సెలింగ్

వికారాబాద్ అర్బన్: సమగ్ర శిక్షలో భర్తీ కానీ పోస్టులకు శనివారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ కారణాలతో జిల్లా సమగ్ర శిక్షలోని కేజీబీవీ, యుఆర్ఎస్ పాఠశాలల్లో భర్తీ కాని 9 పోస్టులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గత నెలలో 62 మందిని ఆయా విభాగాల్లో కాంట్రాక్ట్ పద్ధతిన నియమిస్తూ నియామక పత్రాలు అందజేసినట్లు వెల్లడించారు. గతంలో ధ్రువపత్రాల పరిశీలన జరిగిన అభ్యర్థుల నుంచి మెరిట్ ఆధారంగా ఇప్పుడు కౌన్సిలింగ్‌కు పిలుస్తున్నట్లు తెలిపారు. మెరిట్ అభ్యర్థులు మాత్రమే ఒరిజినల్ పత్రాలతో ఉదయం 10గంటలకు కలెక్టరేట్‌లోని డీఈఓ కార్యాలయంలో హాజరు కావాలన్నారు.

స్క్రాప్ వాహనాల ఆన్‌లైన్ వేలం

వికారాబాద్ అర్బన్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖలోని ఏడు 104 స్క్రాప్ వాహనాలను ఆన్‌లైన్‌లో వేలం వేయనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పాల్వన్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో 7 స్క్రాప్ వాహనాలు ఉన్నాయని, www.auction.telangana.gov.inలో వేలం వేయనున్నట్లు ఆయన వెల్లడించారు. ఆసక్తిగల వారు నియమ నిబంధనలను వెబ్‌సైట్‌లో సరి చూసుకోవచ్చునని పేర్కొన్నారు. ఈ నెల 2 నుంచి 10వ తేదీ వరకు ఆన్‌లైన్ వేలం కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. 15వ తేదీ ఉదయం 11గంటల నుంచి వేలం ఉంటుందన్నారు. స్క్రాప్ వాహనాల తనిఖీ కోసం జిల్లా రవాణాశాఖ కార్యాలయం ఆవరణలో అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెం: 99085 56100, 99087 82437ను సంప్రదించాలన్నారు.

జీఓ 302ను పునరుద్ధరించాలి



అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘాలు

అనంతగిరి: ప్రభుత్వం వెంటనే సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి ఓపీఎస్ విధానం అమలు చేయాలని వికారాబాద్ జిల్లా ఉపాధ్యాయ సంఘాల సంయుక్త కార్యాచరణ సమితి ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వం వెంటనే పీఆర్సీ కమిటీ వేసి ఐఆర్ ప్రకటించాలన్నారు. అర్హత కలిగిన స్కూల్ అసిస్టెంట్లకు జీఎల్‌గా పదోన్నతి పొందేందుకు జీఓ 302ను పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు నర్సింహులు, రామకృష్ణ, పవన్, భాస్కర్, దానయ్య అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల గోడు పట్టని ప్రభుత్వాలు



నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ ఉద్యోగులు

తాండూరు: సీపీఎస్ అంతమొందించే వరకు పోరాటం కొనసాగుతోందని మున్సిపల్ ఉద్యోగులు స్పష్టం చేశారు. శుక్రవారం తాండూరు మున్సిపల్ కార్యాలయ సీపీఎస్ బాధిత ఉద్యోగులు మధ్యాహ్నం భోజన విరామంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడారు. సీపీఎస్ విధానం రద్దు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం ఆరోపించారు. సంవత్సరాలుగా ఉద్యమిస్తున్న తమ గోడును పట్టించుకోవడం లేదని విమర్శించారు. వెంటనే ప్రభుత్వం సీపీఎస్ విధానం ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉద్యోగులు నరేందర్‌రెడ్డి, ఆంజనేయులు శ్రీనివాస్, రాములు, నర్మద, సునిత తదితరులు ఉన్నారు.

ఇనాంగూడ బస్టాప్‌లో గుర్తుతెలియని మృతదేహం



అబ్దుల్లాపూర్‌మెట్: మండల పరిధిలోని ఇనాంగూడ బస్టాప్‌లో శుక్రవారం ఉదయం ఓ గుర్తుతెలియని మృతదేహం పడి ఉందని స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి వెళ్లిన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు మృతదేహాన్ని పరిశీలించగా ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతుడి వయస్సు 35–40 సంవత్సరాల మధ్య ఉంటుందని, బూడిద రంగు షర్ట్, ఆరెంజ్ కలర్ గీతల టవల్‌ను ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతుడి వివరాలు తెలిసినవారు అబ్దుల్లాపూర్‌మెట్ పీఎస్‌లో సంప్రదించాలని కోరారు.

ఓటు రాజ్యాంగం కల్పించిన హక్కు

- అర్హులందరూ ఓటరుగా పేర్లు నమోదు చేసుకోవాలి
- డబుల్ ఓటు ఉన్నవారి వివరాలను బీఎల్‌ఓలు సేకరించాలి
- నమోదుపై నిర్లక్ష్యం తగదు
- అవగాహన కార్యక్రమాల్లో తహసీల్దార్లు



పెద్దేముల్: మండల సమాఖ్య భవనంలో ఐకేపీ సిబ్బందితో మాట్లాడుతున్న తహసీల్దార్ కిషన్

పెద్దేముల్: 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని, ప్రతి పౌరుడికీ ఓటు రాజ్యాంగం కల్పించిన హక్కు అని తహసీల్దార్ కిషన్ అన్నారు. శుక్రవారం మండల సమాఖ్య భవనంలో ఓటు హక్కు నమోదుపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఏపీఎం, సీసీలు, మండల సమాఖ్య సభ్యులతో ఆయన మాట్లాడారు. ఓటు హక్కుకు ఉన్న శక్తి దేనికీ లేదని, ఎన్నికల సమయంలో ప్రతి ఒక్కరికీ ఓటు ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఆ హక్కుతోనే పాలకులను ఎన్నుకుంటామని వెల్లడించారు. ఐకేపీ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి డబుల్ ఓటు, మరణించిన వివరాలను సేకరించాలని సూచించారు. ఓటరు జాబితాలో ఏదైనా తప్పులు ఉంటే వాటిని వెంటనే సరిచేసుకోవాలని సూచించారు. ఫారం-6,7,8పై ఏమైనా సందేహాలు ఉంటే తీర్చుకునేందుకు మండల కేంద్రంలో ఓటరు అవగాహన వేదికను ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల మండల సమాఖ్య సభ్యులు, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

బీఎల్‌ఓలకు కిట్ల పంపిణీ

ఓటు హక్కు కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రభుత్వం అన్ని ఏర్పాటు చేస్తుందని తహసీల్దార్ కిషన్ అన్నారు. ఇందులో భాగంగా బీఎల్‌ఓలకు మండల పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్ కిట్లను పంపిణీ చేసి మాట్లాడారు. మండలానికి 43కిట్లు వచ్చాయని, ప్రస్తుతం పంచాయతీ కార్యదర్శులకు అందజేస్తున్నామని, మిగతా బీఎల్‌ఓలకు డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐ, జూనియర్ అసిస్టెంట్లు గ్రామాలకు వెళ్లి కిట్లు అందజేస్తారని వెల్లడించారు.

అందుబాటులో బీఎల్‌ఓలు

దౌల్తాబాద్: అక్టోబర్ 1నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ విజయ్‌కుమార్ తెలిపారు. స్థానిక తహసీల్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. సెప్టెంబర్ 2, 3వ తేదీల్లో పోలింగ్ కేంద్రాల వద్ద బీఎల్‌ఓలు అందుబాటులో ఉండి కొత్త ఓటర్ల నుంచి దరఖాస్తులు, సవరణలకు సంబంధించిన అర్జీలను తీసుకుంటారని పేర్కొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

కొడంగల్: 18 సంవత్సరాలు నిండిన యువత ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ విజయకుమార్, డిప్యూటీ తహసీల్దార్ సురేష్ కోరారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఓటు హక్కుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటు హక్కు గురించి వివరించారు. అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో ఎలక్షన్ డీటీ శివకుమార్, రికార్డు అసిస్టెంట్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



కొడంగల్: దరఖాస్తు తీసుకుంటున్న రికార్డు అసిస్టెంట్



దోమ: బీఎల్‌ఓలతో మాట్లాడుతున్న తహసీల్దార్ పురుషోత్తం

విద్యార్థులతో ఎలక్ట్రాన్ లిటరసీ క్లబ్

బంట్వారం: అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఓటు హక్కుపై బంట్వారం మాడల్ స్కూల్‌లో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పాఠశాలల్లో 10 మంది విద్యార్థులను కలిపి ఎలక్ట్రాన్ లిటరసీ క్లబ్‌గా ఏర్పాటు చేయాలని సూచించారు. ఇందుకు సంబంధించి ఒక టీచర్‌ను నోడల్ అధికారిగా నియమించి విద్యార్థులను పర్యవేక్షించాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంఈఓ చంద్రప్ప, మాడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సరళారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం తగదు

దోమ: బీఎల్‌ఓలు ఓటరు నమోదుపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ పురుషోత్తం హెచ్చరించారు. తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓలతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామంలో ఓటరు నమోదులో ఎలాంటి సవరణలు ఉన్న త్వరితగతిన పూర్తి చేసేందుకు బీఎల్‌ఓలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ లింగం, బీఎల్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

ఓటు వజ్రాయుధం

తాండూరు రూరల్: అక్టోబర్ 1వ తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ తారాసింగ్ అన్నారు. పట్టణంలోని జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఓటర్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం అని, ప్రతి ఒక్కరూ ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్, ఆర్ఐ రాజిరెడ్డి, జూనియర్ అసిస్టెంట్ నరేష్ పాల్గొన్నారు.

కిట్స్ అందజేత

బొంరాస్‌పేట: బూత్‌స్థాయి అధికారులైన బీఎల్‌ఓలకు తహసీల్దారు వెంకటేశ్ కిట్స్ అందజేశారు. ఇందులో ఓటరు, పోలింగ్ కేంద్రం పత్రాలు, తదితర సమాచార పత్రాలు, సామగ్రి ఉంటుందని పేర్కొన్నారు. ఓటుహక్కు నమోదు పట్ల విస్తృత ప్రచారం చేసి, అర్హులందరికీ ఓటుహక్కు కల్పించాలన్నారు.

ఓటరు జాబితాను ఉర్దూలో ముద్రించాలి

కొడంగల్ రూరల్: రానున్న సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఓటరు జాబితాను ఉర్దు భాషలో ముద్రించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎంఐఎం నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్‌బీ.గుల్షన్ డిమాండ్ చేశారు. పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఉర్దును రెండో భాషగా గుర్తించిందని, అందుకు తగిన విధంగా ఓటరు జాబితాను సైతం ఉర్దులో ముద్రించేందుకు కృషిచేయాలని కోరారు. తెలుగు, ఇంగ్లిష్ మాదిరిగానే ఉర్దుకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఉర్దు వచ్చిన వారికి అవగాహన కలుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎండీ.ముర్తుజా, షేక్ రోమన్, ఎండీ.సైఫాన్, ఎండీ.అజర్, షేక్ ఆబిద్, సయ్యద్ ముస్తాఫ, ఎండీ.సర్తజ్, ఎండీ అర్షద్ తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ అధ్యాపకులకు ఆహ్వానం

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ అధ్యాపకులుగా బోధించుటకు ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 4 సాయంత్రం 4 గంటల లోపు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ మల్లయ్య ఒక ప్రకటనలో తెలిపారు. గణితం, భౌతిక శాస్త్రం, వృక్ష శాస్త్రం సబ్జెక్టుల ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. అర్హులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఆలయంలో చోరీ

తాండూరు రూరల్: మండల పరిధి కోత్లాపూర్ శివారులో ఉన్న రేణుక ఎల్లమ్మ ఆలయంలో చోరీ జరగగా.. నిందితున్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు కరన్‌కోట్ ఎస్ఐ-2 విమల తెలిపారు. ఎస్ఐ చెప్పిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం చించోళి తాలుకాలోని కల్లూరుకు చెందిన నగేష్.. శుక్రవారం తెల్లవారుజామున ఎల్లమ్మ ఆలయంలో తలుపులు పగలగొట్టి లోపలికి వెళ్లాడు. ఆలయంలో ఉన్న హుండీ పగల గొట్టి రూ.5 వేల నగదుతో పాటు రూ.2 వేల విలువైన అమ్మవారి సామగ్రిని దొంగలించాడు. ఇది గమనించిన స్థానికులు దొంగను పట్టుకొని పోలీసులకు అప్పగించారు. ఆలయ కమిటీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని నిందితున్ని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

మద్యానికి బానిసై.. వ్యక్తి ఆత్మహత్య

మహేశ్వరం: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పహాడీషరీఫ్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాలు.. జల్‌పల్లి శ్రీరాంకాలనీకి చెందిన కుషాల్ బాయి, సంతోష్(48) దంపతులు. కొంతకాలంగా సంతోష్ తాగుడుకు బానిసయ్యాడు. వారం రోజుల నుంచి మద్యానికి డబ్బులు అడుగుతుండటంతో కుటుంబ సభ్యులు మందలించారు. గురువారం రాఖీ పండుగ ఉండటంతో కుటుంబ సభ్యులు బయటికి వెళ్లారు. రాత్రి వచ్చి చూడగా సంతోష్ బెడ్‌రూంలో చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి



పరిగి: పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి

పరిగి: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. పట్టణ కేంద్రంలోని టీచర్స్ కాలనీలో శ్రీ అమృతాంజనేయ స్వామి దేవాలయంలో శుక్రవారం శివలింగ, మహాగణపతి, నవగ్రహ పునఃప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరూ భక్తి మార్గాన్ని ఎంచుకోవాలని, దాంతోనే ముక్తి లభిస్తుందని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్, జెడ్పీటీసీ హరిప్రియ, ఎంపీపీ అరవింద్‌రావు, కుల్కచర్ల ఎంపీపీ సత్యహరిశ్చందర్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ భాస్కర్, వెంకటయ్య, కౌన్సిలర్లు రవీందర్, మండల అధ్యక్షుడు ఆంజనేయులు, సంతోష్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

సేవాగుణాన్ని అలవర్చుకోవాలి

కుల్కచర్ల: ప్రతి ఒక్కరూ భక్తిభావాన్ని, సేవాగుణాన్ని అలవర్చుకోవాలని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కుల్కచర్ల మండలం బండవెల్కిచర్ల గ్రామ పరిధి శ్రీ పాంబండ రామలింగేశ్వర స్వామి దేవస్థానం సమీపాన ఏపీసీఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు తుప్పలి అశోక్‌కుమార్ తన తండ్రి రాములు స్మారకార్థం నిర్మించిన ముఖద్వారం ప్రారంభించి మాట్లాడారు. ఆలయాల అభ్యున్నతికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని చెప్పారు. అశోక్‌కుమార్ తన తండ్రి స్మారకార్థం ముఖద్వారం నిర్మించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఇందులో ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, జెడ్పీటీసీ రాందాస్ నాయక్, పాంబండ ఆలయ చైర్మన్ రాములు, ఈట సుధాకర్, మార్కెట్ కమిటీ చైర్మన్ హరికృష్ణ, రైతుబంధు అధ్యక్షుడు రాజు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శేరిరాంరెడ్డి, చౌడాపూర్ మండల అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, నాయకులు వెంకటయ్య, రాజప్ప, జానకీరాం, కృష్ణయ్య, మొగులయ్య, సార శ్రీనివాస్, రత్నమ్మ, కొండయ్య, ఆనంద్, అరవింద్, పులిరాములు, సంజీవ్, పూజారి పాండుశర్మ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

పూడూరు: గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా పేద ప్రజలే ఉంటారని, వారికి మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. పూడూరు మండలం మన్నేగుడలో క్యూర్‌వెల్ ప్రైవేటు ఆస్పత్రిని ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామాలకు సైతం కార్పొరేట్ స్థాయి ఆస్పత్రుల సేవలు రావడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రి నిర్వాహకులు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ వినోద్‌గౌడ్, ఎంపీటీసీ మస్రత్ ఆదిల్, నాయకులు జాహెద్, ఖుద్రత్, అయాబ్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

సెలవులో అధికారులు.. ఇబ్బందుల్లో జనం

తహసీల్దార్ కార్యాలయంలో నిలిచిన సేవలు



ఖాళీ కుర్చీతో దర్శనమిస్తున్న తహసీల్దార్ కార్యాలయం

పరిగి: తహసీల్దార్ కార్యాలయంలో సేవలు నిలిచిపోయాయి. అధికారులు వరుసగా సెలవులు పెట్టడంతో శుక్రవారం ఎలాంటి పనులు కొనసాగలేదు. పలు సేవల కోసం వచ్చిన ప్రజలు సాయంత్రం వరకు కార్యాలయం చుట్టూ తిరిగి చేసేదేమి లేక వెనుదిరిగారు. పలు ధ్రువపత్రాలు, క్రాప్ రుణాల కోసం వచ్చిన వారు తీవ్ర ఇబ్బందులకు గురయినట్లు పేర్కొన్నారు. అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారనే ఆరోపణలతో గురువారం తహసీల్దార్ కార్యాయం ఎదుట భారీ ఆందోళన నిర్వహించారు. ఈ ఉదంతంతోనే అధికారులు సెలవు పెట్టి వెళ్లారని పలువురు ఆరోపిస్తున్నారు. రాఘవపూర్ భూ విషయంలోనే అధికారులు సెలవులో ఉన్నారనే విమర్శలు వస్తున్నాయి. ఈ విషయంపై ఆర్డీఓ విజయకుమారిని వివరణ కోరగా తహసీల్దార్ దానయ్య అనారోగ్యంతో సెలవుల్లో ఉన్నారని, డిప్యూటీ తహసీల్దార్ నరసింహారెడ్డి ఎన్నికల విధుల్లో కలెక్టరేట్‌లో ఉన్నారని ఆమె తెలిపారు.

నిత్యవసరాల ధరను తగ్గించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర నాయకులు

అనంతగిరి: నిత్యవసర సరుకుల ధరలను వెంటనే తగ్గించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు వెంకటరాములు డిమాండ్ చేశారు. శుక్రవారం వికారాబాద్‌లోని సీపీఎం కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర కమిటీ పిలుపు మేరకు సెప్టెంబర్ ఒకటి నుంచి 7 వరకు అధిక ధరలు, ఉపాధి అవకాశాల కల్పనపై దేశవ్యాప్తంగా ఉద్యమాలు నిర్వహించాలని చెప్పారు. 10 నుంచి 17 వరకు రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ సాయుధ పోరాట విప్లవ వారోత్సవాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి మల్లేశం, వెంకటయ్య, చంద్రయ్య, రామకృష్ణ, సతీష్, రవి తదితరులు పాల్గొన్నారు

ఆటకు చోటేదీ?

- క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వని బడులు
- సర్కారు పాఠశాలల్లో వేధిస్తున్న పీఈటీల కొరత
- ప్రైవేట్ స్కూళ్లలో మైదానాల సమస్య

నవాబుపేట: క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం.. శారీరక దృఢత్వం.. మానసికోల్లాసం.. వేదికలెక్కిన ప్రతి ఒక్కరూ చెప్పే మాటలివే.. అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉన్నాయి. క్రీడలు పాఠశాల స్థాయి నుంచే ప్రారంభమవుతాయి. అక్కడే సమస్యలు తిష్టవేశాయి. ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వకపోవటం, శిక్షణకు అవసరమైన సిబ్బంది అందుబాటులో ఉండకపోవడం ప్రధాన సమస్యగా మారింది. ఇక ప్రైవేటు స్కూళ్లల్లో ఆటల సంగతి అంతే.. పెద్దపెద్ద భవనాల్లో పాఠశాలలు నిర్వహిస్తున్నా.. క్రీడా మైదానాలు మాత్రం ఉండడం లేదు. తూతూ మంత్రంగా ఉన్న కొద్దిపాటి స్థలంలోనే ఆటలు ఆడిస్తూ చేతులు దులుపుకుంటున్నారు. మండలంలో మొత్తం 42 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా వాటిలో 11 ఉన్నత, 5 ప్రాథమికోన్నత, 26 ప్రాథమిక పాఠశాలలు, ఒక కేజీబీవీ, ఒక ఆదర్శ పాఠశాల ఉంది. వీటిలో 2,300 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఎల్లకొండ, నవాబుపేట, మమ్మదాన్‌పల్లి, పులుమామిడి, గంగ్యాడ, మీనపల్లికలాన్, ఎక్‌మామిడి, చించల్‌పేట, ముబారక్‌పూర్ గ్రామాల్లో మాత్రమే క్రీడా మైదానాలు ఉన్నాయి. చించల్‌పేట, ఎల్లకొండ, నవాబుపేట, పులుమామిడి పాఠశాలల్లో పీఈటీలు ఉన్నారు. మిగిలిన ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో క్రీడా మైదానాలు, వ్యాయామ ఉపాధ్యాయులు లేరు. దీంతో సర్కారు బడుల్లో చదువుకునే పేద పిల్లలు ఆటలకు దూరమవుతున్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో..

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రైవేటు పాఠశాలలకు తప్పనిసరిగా క్రీడా మైదానాలు ఉండాలి. మండలంలో నాలుగు ప్రైవేటు పాఠశాలలు ఉండగా వాటిలో 900 మంది విద్యార్థులు చదువుతున్నారు. మండల కేంద్రంలోని రెండు పాఠశాలలకు మినహా మిగిలిన రెండు స్కూళ్లకు క్రీడా మైదానాలు లేవు.

“ పీఈటీల కొరత ఉంది



మండలంలో 11 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. నవాబుపేట, పులుమామిడి, చించల్‌పేట, ఎల్లకొండ పాఠశాలల్లో మాత్రమే వ్యాయామ ఉపాధ్యాయులు ఉన్నారు. మిగిలిన ఏడు పాఠశాలల్లో పీఈటీల కొరత ఉంది. ప్రభుత్వం ఖాళీలను భర్తీ చేస్తే విద్యార్థులకు మేలు చేకూరుతుంది.

– గోపాల్, ఎంఈఓ, నవాబుపేట



నవాబుపేటలో ఖోఖో ఆడుతున్న విద్యార్థులు

రెండు బైకులు ఢీ

ఒకరికి తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న బాలయ్య

మోమిన్‌పేట: ఒక బైక్‌ను వెనుక నుంచి మరో బైక్ ఢీ కొట్టిన ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మోమిన్‌పేటలో శుక్రవారం మధ్యాహ్నం చోటు చేసుకొంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధి కేసారం గ్రామానికి చెందిన బాలయ్య మోమిన్‌పేట పీఏసీఎస్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో విధుల నిమిత్తం మోమిన్‌పేటకు బైక్‌పై వెళ్తున్న అతన్ని, కార్తికేయ ఇండస్ట్రీస్ సమీపానికి చేరుకోగానే పెద్దేముల్ మండలం రుద్రారం గ్రామానికి చెందిన అభిషేక్, బిక్యానాయక్‌లు వేగంగా బైక్‌ను నడిపిస్తూ ముందున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టారు. దీంతో బాలయ్య రోడ్డుపై పడిపోయి తలకు, కాళ్లకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రున్ని చికిత్స నిమిత్తం వారు సంగారెడ్డిలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

నిందితులను కఠినంగా శిక్షిస్తాం

ఇన్‌స్పెక్టర్ సురేశ్

నందిగామ: శివలింగాన్ని ధ్వంసం చేసిన నిందితులను గుర్తించి కఠినంగా శిక్షిస్తామని ఇన్‌స్పెక్టర్ సురేష్ అన్నారు. నందిగామ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం నర్సప్పగూడ గ్రామపెద్దలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. శివలింగం నెలరోజుల క్రితమే ధ్వంసమైనట్లు తమ విచారణలో తేలిందని తెలిపారు. భక్తులను విచారించగా పలు విషయాలు వెలుగులోకి వచ్చాయని పేర్కొన్నారు. పగిలిపోయిన శివలింగాన్నే పూజిస్తున్నట్లు భక్తుల ద్వారా తెలిసిందన్నారు. ఇప్పటికే క్లూస్‌టీం ద్వారా వివరాలు సేకరించామని.. ఎవరైనా ఉద్దేశపూర్వకంగా ధ్వంసం చేసినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ గోపాలకృష్ణ, జెడ్పీ వైస్‌చైర్మన్ గణేశ్, సర్పంచ్ అశోక్, నాయకులు యాదగిరి, లక్ష్మణ్‌గౌడ్, అరవింద్, అశోక్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రాఘవేంద్రస్వామి ఉత్సవాలు



రాఘవేంద్రస్వామి ఆలయంలో ఆరాధన ఉత్సవాలు

తాండూరు: పట్టణంలోని గురు రాఘవేంద్ర స్వామి(ఉత్తరాధి మఠం)లో శుక్రవారం మధ్యారాధన ఉత్సవాలు అత్యంత భక్తి శ్రద్ధలతో జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకులు సుధీంద్ర చార్యుల ఆధ్వర్యంలో రెండు రోజులుగా జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం 6 గంటలకు నిర్మాల్య విసర్జనము, పంచామృతాభిషేకం, అష్టోత్తర పారాయణం, ఉదయం 10.30 గంటల నుంచి స్వామి వారికి తులసి అర్చన, జయరామ మహిళా సేవ సమితి సభ్యులు లక్ష్మి శోభానే, మధ్యాహ్నం 1 గంట నుంచి హస్తోదకము, మహా మంగళహారతి, మహా నైవేద్యం కార్యక్రమాలు జరిగాయి. అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

విద్యార్థులు క్రీడలపై మక్కువ చూపాలి



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

జోనల్ సెక్రటరీ రాజశేఖర్‌రెడ్డి

పెద్దేముల్: విద్యార్థులు క్రీడల పట్ల ఆసక్తి చూపాలని పెద్దేముల్ స్కూల్ గేమ్ ఫెడరేషన్ జోనల్ సెక్రటరీ రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో 2023–24 విద్యా సంవత్సరానికి గాను రెండు రోజుల పాటు జరిగిన జోన్ క్రీడాకారుల ఎంపిక శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. క్రీడాకారుల ఎంపిక ప్రశాంతంగా జరిగిందని, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్‌తో పాటు అన్ని ఆటలకు విద్యార్థులను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. మండల స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులను డివిజన్ స్థాయికి పంపిస్తామని వెల్లడించారు. కోటపల్లి, పెద్దేముల్, ధారూర్ మండలం లోని సుమారు 24 పాఠశాలల నుంచి 500 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. కార్యక్రమంలో పీఈటీ, పీడీలు రాధకృష్ణ, రాజు, గోపిక, భాగ్యలక్ష్మి, ప్రమోద్, విజయభాస్కర్, అంబదాస్, లక్ష్మయ్య, వెంకటరాం, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.